సాక్షి పార్వతీపురం మన్యం

మంగళవారం । 16 । మే । 2023



స్పందనకు 122 వనతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 122 వినతులు అందాయి. - 8లో



మర్రిమానుగూడలో చోరీ

సీతంపేట మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధి మర్రిమానుగూడ గ్రామంలో ఒక ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. - 8లో



తప్పిపోయిన ఐదేళ్ల బాలుడి అప్పగింత

తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. - 8లో

న్యూస్‌రీల్

మామిడిపల్లిలో ఆధ్యాత్మిక శోభ

- ముంగారమ్మతల్లిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం



ముంగారమ్మ తల్లిని దర్శించుకుంటున్న డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, నాయకులు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి గ్రామ దేవత ముంగారమ్మతల్లి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పసుపుకుంకుమలు, ఘటాలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

19న మెగా జాబ్‌మేళా



మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న సీతంపేట ఐటీఐలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. టెన్త్, యూజీ, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. మెగా జాబ్‌మేళాకు 12 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ప్రొడక్షన్, ఫార్మాసిస్టు, రిటైల్, మెషిన్ ఆపరేటర్, సేల్స్‌ఎగ్జిక్యూటివ్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌డీసీ. ఇన్‌లో అప్‌లై చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ 70320 60773, 63051 10947 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సుధాకర్

విజయనగరం: ప్రభుత్వ పథకాలు అర్హులకు వర్తింపజేయడం, పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంపై క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ నెల 15 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు 16 రోజుల పాటు శిక్షణ ఇస్తామని మెప్మా పీడీ సుధాకర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సాంకేతిక, సహాయక సిబ్బంది 400 మందికి విజయనగరంలోని యూత్ హాస్టల్‌లో రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందని, బ్యాచ్‌కు 50 మంది చొప్పున రెండురోజుల పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. మొదటి రోజు సోమవారం ఉమ్మడి జిల్లాకు చెందిన సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారన్నారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించే శిక్షణ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాదలింగిలో గజరాజుల తిష్ఠ



మాదలింగి వద్ద సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండలంలోని మాదలింగి గ్రామ పరిసరాల్లో గజరాజులు తిష్ఠవేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లోని పామాయిల్, మొక్కజొన్న పంటలతో పాటు మోటార్లను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో కొన్నాళ్లుగా సంచరిస్తున్న ఒంటరి ఏనుగు ఏ క్షణాన గ్రామంలోకి చొరబడి దాడి చేస్తుందోనని భయంతో వణికిపోతున్నారు. ఏనుగుల కదలికలపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినా సంబంధిత అటవీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

• మంచు... ఎండ



ఉదయం 8 గంటల సమయంలో పాలకొండ పట్టణాన్ని చుట్టుముట్టిన పొగమంచు



మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎండ ధాటికి నిర్మానుష్యంగా మారిన పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రోడ్డు

ప్రస్తుత వేసవి కాలంలో వాతావరణం భిన్నంగా ఉంది. రెండు రోజులుగా పగటిపూట శీతాకాలం వలే ఉదయం 8 గంటలవరకు మంచు దట్టంగా కురుస్తోంది. అనంతరం భానుడు నిప్పులవాన కురిపిస్తున్నాడు. 39 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడగాల్పు దాటికి తట్టుకోలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీనికి పాలకొండ పట్టణంలో గురువారం కనిపించిన ఈ చిత్రాలే నిదర్శనం.

– పాలకొండ రూరల్

వృత్యంతర శిక్షణతో వృత్తి నైపుణ్యాలు

విజయనగరం ఫూల్‌బాగ్: డీఎస్సీ–1998, 2008లో నియమితులైన ఎస్‌జీటీ, ఎమ్‌టీఎస్ ఉపాధ్యాయులకు ఐదురోజుల పాటు నిర్వహించే వృత్యంతర శిక్షణతో వృత్తి నైపుణాలు పెంపొందించుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ టి.తిరుపతినాయుడు సూచించారు. విజయనగరం కస్పాహైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్, ఎన్‌ఈపీ–2020 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైట్ సిబ్బంది డి.ఈశ్వరరావు, డి.అప్పలనాయుడు, కె.సూర్యారావు, వీవీజే సుబ్రహ్మణ్యం, ఎమ్.రామకృష్ణ, ఎల్.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



పార్వతీపురం మండలం దోకిశీల గ్రామంలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా వాటర్‌ట్యాంక్‌ను శుభ్రపరుస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

- జిల్లాలో ప్రతి శుక్ర, శనివారాల్లో డ్రైడే కార్యక్రమాలు
- తాగునీటి నిల్వ కేంద్రాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు
- గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి
- మన్యం జిల్లాలోని 452 పంచాయతీల్లో ప్రతీవారం డ్రైడే నిర్వహణ



సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పార్వతీపురంటౌన్:

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పారిశుద్ధ్యం మెరుగుకు చక్కని ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తోంది. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం నింపుతోంది. పట్టణాలు, పల్లెలు, నివాసిత ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషిచేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని 452 పంచాయతీల్లో క్రమంతప్పకుండా ప్రతీ శుక్రవారం, శనివారం డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో నిర్వహిస్తున్నారు. వ్యాధులకు కారణమైన దోమల వృద్ధికి చెక్‌పెడుతున్నారు.

అప్రమత్తమైన యంత్రాంగం

అకాల వర్షాలతో ఎక్కడికక్కడే వర్షపు నీరు చేరింది. వీటిలో దోమలు వృద్ధి చెందకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తున్నారు. నెలకు రెండుసార్లు తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేస్తున్నారు. బ్లీచింగ్, ఫాగింగ్, క్లోరినేషన్ చేస్తూ ప్రజల ఆరోగ్యానికి పాటుపడుతున్నారు. మరోవైపు వైద్య సిబ్బంది ఊరూరా పర్యటిస్తూ ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్నారు.

జిల్లాలో నెలరోజుల్లో డ్రైడే కార్యక్రమాల నిర్వహణ ఇలా...

మండలం	పంచాయతీలు	నిర్వహించిన డ్రైడే పనులు
భామిని	27	84
వీరఘట్టం	34	67
సీతంపేట	53	465
పాలకొండ	32	63
కురుపాం	23	342
జియ్యమ్మవలస	31	196
గుమ్మలక్ష్మీపురం	27	113
కొమరాడ	32	145
మక్కువ	21	93
పార్వతీపురం	30	115
సాలూరు	29	229
సీతానగరం	35	52
బలిజిపేట	24	38
గరుగుబిల్లి	25	47
పాచిపెంట	29	198

ప్రణాళిక బద్ధమైన చర్యలు



పార్వతీపురం మన్యం జిల్లాను మరింత పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు చేపట్టాం. ప్రతీ శుక్ర, శని వారాల్లో గ్రామాల్లో క్రమం తప్పకుండా డ్రైడే నిర్వహించాలని అధికారులను ఆదేశించాం. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య వంతులను చేస్తున్నారు. స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీ అధికారులు సిబ్బందితో నీటి నిల్వ కేంద్రాల పరిశుభ్రతను పర్యవేక్షిస్తున్నారు.

– నిషాంత్‌కుమార్, జిల్లా కలెక్టర్, పార్వతీపురం మన్యం



కేదారిపురం గ్రామంలో చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

డెంగీతో జాగ్రత్త..!

- అప్రమత్తతే ప్రధానం
- ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి
- 2022లో 451 కేసుల నమోదు
- ఈ ఏడాది ఇప్పటివరకు 131 కేసులు
- నేడు డెంగీ నివారణ దినోత్సవం



సర్వజన ఆస్పత్రిలో డెంగీ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్:

డెంగీ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం అలసత్వం వహించినా మృత్యువాత పడే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధిబారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం(మే 16) సందర్భంగా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వైద్యుల మాటల్లోనే...

- డెంగీ... వైరల్ జ్వరం మాదిరి ఆకస్మాత్తుగా సోకుతుంది. తలనొప్పి, ఒళ్లునొప్పులు, కీళ్ల నొప్పులతో ఎముకల విరిగేటంత నొప్పి కలిగిస్తుంది. ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం కలగడంవల్ల కాళ్లు, చేతులు, ముఖం, వీపు ఉదర భాగాల చర్మం ఎర్రగా కందినట్టు చిన్నచిన్న మొటిముల కనిపిస్తాయి. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా ఉంటుంది. ఈడిస్‌ఈజిప్ట అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాప్తిచెందుతుంది. దోమ పగటి పూట కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దర్లు కనిపిస్తాయి.
- ఇళ్లలోని కుండీలు, మట్టిపాత్రలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఎయిర్ కూలర్లు, ఇళ్ల పరిసరాల్లో నిర్లక్ష్యంగా పడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కప్పులు, పగిలిన సీసాలు, టైర్లలో చేరిన వర్షపు నీటిలో గుడ్లు పెట్టి ఈడిస్‌దోమ పెరుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఇంటి పరిసర ప్రాంతాల్లో వృథానీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంటిలోని చెత్తాచెదారం దూరంగా వేయాలి. ఇంటిలోని అన్ని గదుల్లోనూ దోమలనివారణ మందు జల్లాలి. దోమ తెరలు వినియోగించడం ఉత్తమం. నీరు నిల్వచేసే పాత్రలను వారానికి ఓసారి ఆరబెట్టాలి. తాగి వదిలిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, పూలకుండీల్లో నీటిని తరచూ మార్చాలి. నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలి. క్రమంగా శుభ్రం చేసుకోవాలి. దోమ కాటునుంచి రక్షణకొరకు శరీరం అంతా కప్పి ఉంచు కునేలా దుస్తులు వేసుకోవాలి. పిల్లలకు దుస్తులు లేకుండా బయట తిరగనీయరాదు. కుళాయి దగ్గర నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

2020 నుంచి 2023 మే 15 వరకు జరిపిన డెంగీ పరీక్షలు, కేసుల సంఖ్య వివరాలు

సంవత్సరం	పరీక్షలు	నమోదైన డెంగీ కేసుల సంఖ్య
2020	708	15
2021	3912	242
2022	3310	451
2023	1314	136

దోమల నివారణే ప్రధానం



దోమల నివారణతో డెంగీని అరికట్టవచ్చు. డెంగీ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యాధి లక్షణాలు కనిపించి న వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ద్రవ పదార్థాలు, పళ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ సుధశ్రీ, జనరల్ మెడిసిన్ హెడ్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



డెంగీ వ్యాధి కలుగుజేసే దోమ

కల్యాణ మండపానికి భూమి పూజ



శ్రీనివాస కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విశ్రాంత ఐఏఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్ తదితరులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.కోటి వ్యయంతో నిర్మించే శ్రీనివాస కల్యాణ మండపం నిర్మాణానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్ సోమవారం భూమిపూజ చేశారు. ముందుగా వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకుడు అప్పలాచార్యులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం బలిజేపల్లి లక్ష్మీకాంత విరచిత 'సత్యహరిశ్చంద్రీయం' పద్యనాటక సహిత ప్రతిపదార్థ తాత్పర్యంలతో ముప్పల వెంకటరమణ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓగా పనిచేసి స్వామివారి సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు కృషిచేయాలని తోటపల్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను కోరారు. కార్యక్రమంలో టీటీడీ సేవా ట్రస్టు అధ్యక్షుడు డి.ధనుంజయరావు, యడ్ల గోపాలరావు, ఎం.రామలింగేశ్వరరావు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, అఖిల భారత ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆర్.వాసుదేవరావు పాల్గొన్నారు.

సాగునీటి వెతలు తీర్చేలా.. తోటపల్లి పనులు

- రూ.132 కోట్ల వ్యయంతో తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు
- రూ.80 కోట్లతో కాలువల నిర్మాణం
- లస్కర్ల నియామకానికి జలవనరుల శాఖ ప్రతిపాదనలు



బొబ్బిలి-బలిజిపేట మండలాల మధ్య తోటపల్లి కాలువ

బొబ్బిలి:

తోటపల్లి ప్రాజెక్టు... విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల రైతులకు సాగునీటి ఆదరువు. ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉన్నా పిల్లకాలువలు నిర్మించకపోవడం, మదుముల మరమ్మతులు, పూడికపోయిన కాలువలతో ఏటా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. రైతుల సమస్యను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టు మిగులు పనులపై దృష్టిసారించింది. బడ్జెట్‌లో రూ. 132 కోట్లు కేటాయించింది. దశలవారీగా ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పూర్తిచేస్తోంది. ప్రస్తుతం పిల్లకాలువల పనులు చకచకా సాగుతున్నాయి.

తోటపల్లి ప్రాజెక్టు నుంచి 82వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పనులు పూర్తయితే సుమారు 2లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. వచ్చే ఖరీఫ్‌కు పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా జలవనరులశాఖ అధికారులు పనులు జరిపిస్తున్నారు. దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

లస్కర్ వ్యవస్థకు నీళ్లొదిలిన టీడీపీ

సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందేలా చూడడం.. కాలువల పర్యవేక్షణ.. మదుముల నిర్వహణ.. అడ్డంకులు తొలగించడంలో లస్కర్లది కీలకపాత్ర. గత టీడీపీ ప్రభుత్వం లస్కర్ల నియామకానికి నీళ్లొదిలింది. మూడు జిల్లాలకు సాగునీరు అందించే తోటపల్లి ప్రాజెక్టు పనులపై శీతకన్నువేసింది. ప్రస్తుత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణతో పాటు లస్కర్ల నియామకానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రూ.79లక్షల వ్యయంతో జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంతో రైతన్నల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. సాగునీటి కష్టాలు దూరమవుతాయని భావిస్తున్నారు. సాగునీటి వృథాకు అడ్డుకట్ట పడుతుందని ఆశిస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం

ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణ, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కలిసి ఎమ్మెల్యేలతో విజయనగరం జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. ఇందులో లస్కర్ల నియామకంపై చర్చించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన లస్కర్లను నియమిస్తే వారికి చెల్లించే జీతభత్యాలకు రూ.79 లక్షల వ్యయం అవుతుందని ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. ఇవి త్వరలో మంజూరయ్యే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం



రెండు జిల్లాల పరిధిలోని లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే తోటపల్లి కుడికాలువ చింతాడ, పక్కి, గంగన్నపాడు, లావేరు, పూసపాటిరేగ ప్రాంతాల మీదుగా సాగు నీటి సరఫరా పర్యవేక్షణకు లస్కర్లను నియమిస్తాం. దీనివల్ల సాగునీరు వృథా కాదు. రైతుల మధ్య తగాదాలు, గొడవలు తలెత్తవు. లస్కర్లు చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందేలా పర్యవేక్షిస్తారు. లోటుపాట్లను అధికారులకు తెలియజేస్తారు. దీని వల్ల రైతాంగం సమస్యల్లేకుండా పంటలు సాగు చేసుకోవచ్చు.

– రామచంద్రరావు, ఈఈ, తోటపల్లి జలాశయం



బొబ్బిలి మండలం పిరిడి వద్ద పిల్ల కాలువ నిర్మాణ పనులు

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్



అరెస్ట్ చేసిన వ్యక్తులు, స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్సై హరిబాబు నాయుడు, సిబ్బంది

గుర్ల: మండలంలోని పెనసుబర్తి గ్రామ శివారులో పేకాట స్థావరంపై గుర్ల ఎస్సై హరిబాబు నాయుడు దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.20750 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమవారం తెలిపారు. గ్రామాల్లో పేకాట, మద్యం అమ్మకాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేపట్టిన వారి వివరాలు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బైపాస్ కాలనీ, అజయ్ నగర్, నెహ్రూకాలనీ, గాంధీ సత్రం, దేవీ నగర్, సారిక వీధి, తాళాబత్తుల వీధి, వేమకోటివారి వీధి, పండా వీధి, పాతరెల్లివీధి, తెలకలవీధి, కుసుమగుడివీధి, రామాపురం కాలనీ, కంచరవీధి, జగన్నాథపురం, పాత బస్టాండ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. కావున ప్రజలు ముందుగా తాగునీరు, వాడుకనీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు, ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మర్రిమానుగూడలో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పాలకొండ సీఐ మురళీధర్, ఇన్‌చార్జ్ ఎస్సై నీలకంఠరావు

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధి మర్రిమానుగూడ గ్రామంలో ఒక ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పూయక సోమయ్య మండు వేసవి కావడం, రాత్రి సమయంలో ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ఇంటికి తాళం వేసి ఆరుబయట కుటుంబసభ్యులతో కలిసి పడుకున్నారు. ఇదే అదునుగా ఇంటి వెనుక భాగంలో ఉన్న కిటికీని తొలగించి ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. తన అవసరాల నిమిత్తం దాచుకున్న సుమారు రూ.లక్షా 70 వేలు, మూడు తులాల బంగారం బీరువా తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్టు బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పాలకొండ సీఐ మురళీధర్, ఇన్‌చార్జ్ ఎస్సై ఎ.నీలకంఠరావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీం వచ్చి వ్రేలిముద్రలు ఇతర వివరాలు సేకరించినట్టు ఎస్సై తెలిపారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీఓ జగదీశ్వరరావు

తెర్లాం: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ జగదీశ్వరరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పని చేసిన వారికే మస్టరు వేయాలని, బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు

వంగర: గ్రామాల్లో తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మగ్గూరు గ్రామంలో తాగునీటి బోర్లకు చేపడుతున్న మరమ్మతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడైన బోర్లకు క్రాస్‌ప్రోగ్రాం ద్వారా మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 122 వినతులు



విజయనగరం అర్బన్: అర్జీలను వింటూ పరిష్కారం చెబుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 122 వినతులు అందాయి. అత్యధికంగా 80 వినతుల వరకు రెవెన్యూ శాఖకు చెందినవే వచ్చాయి. మిగిలిన వాటిలో గృహనిర్మాణ శాఖ 12, గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి 10, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 6, మున్సిపల్ సమస్యలపై 5 వినతులు, మిగిలినవి ఇతర వినతులు వచ్చాయి. వినతుల స్వీకరణలో కలెక్టర్ నాగమణి ఎస్, జేసీ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణ, పద్మలీల, బీఎస్‌ఎన్‌దొర తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో రైతుల ఇబ్బంది పట్టించుకోవాలి

జిల్లాలో నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూ సర్వే సక్రమంగా చేపట్టడం లేదని రైతుల ఇబ్బందులను పట్టించుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వేలో ఇచ్చిన పట్టా పుస్తకంలో వివరాలు అసమగ్రంగా ఇస్తూ మరింత రైతులు భూహక్కులు ఇవ్వని పరిస్థితులు ఏర్పడుతున్నాయని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. ఆదరాబాదరాగా సర్వే చేసి పట్టాపుస్తకాలలో తప్పిదాలు పెరుగుతున్నాయని వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షుడు లోకవరపు ఆదినారాయణ మూర్తి, వేమలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట వినతిపత్రంతో రైతు సంఘం ప్రతినిధులు



విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని విజయనగరం ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి బాధితుల వద్ద ఫిర్యాదులు అందుకుని వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులను పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు. స్పందనలో భాగంగా 36 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్సీ సీఐ ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



క్రీడాకారులతో వీడీసీఏ కార్యదర్శి ఎంఎల్‌ఎన్ రాజు, సెలెక్టర్ వర్మ, తదితరులు

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ ఎల్ ఎన్ రాజు

విజయనగరం: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఆటలో ప్రదర్శిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్‌ఎన్ రాజు అన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 16 విభాగంలో బాలబాలికలకు నిర్వహించిన క్రికెట్ శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి హాజరైన వీడీసీఏ కార్యదర్శి మాట్లాడుతూ వేసవి శిక్షణ కార్యక్రమాలతో పిల్లల ఆటల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే మెరుగుపర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు అలాగే కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. శిక్షణకు హాజరైన క్రీడాకారులు కొద్ది రోజుల్లో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో వారి నైపుణ్యం ప్రదర్శించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సెలెక్టర్ వర్మ రాజు, శిక్షకులు ఎ.చంద్రశేఖర్, చందక రమేష్, మహిళా కోచ్ యమునపాల్గొన్నారు.

యూత్ బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న దోలా మన్మథకుమార్

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న యూత్ మెన్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొన బోయే జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ఆవరణలోని బాక్సింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈపోటీలను రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోలా మన్మథ కుమార్ ప్రారంభించగా వారిలో ఉత్తమ ప్రతిభకనబరిచిన 13 విభాగాల్లో 13 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుంచి 21 వరకు విశాఖపట్నంలోని రైల్వే స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శాప్ బాక్సింగ్ అధ్యక్షుడు బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఈ రాజు, డి.మురళి, బాక్సింగ్ రింగ్ అఫిషియల్స్ సంతోష్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో నుంచి జారి వృద్ధురాలి మృతి



సాయమ్మ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో ఆటోబోల్తాపడడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం మండలం లంకాజోడు గ్రామానికి చెందిన హిమరిక తిరుపతిరావు రైల్వేశాఖలో ఉద్యోగం చేస్తూ నెల్లిమర్లలో నివాసం ఉంటున్నాడు. ఆయనతో పాటు తల్లి హిమరిక సాయమ్మ(70) ఆటో డ్రైవర్ ఊయక చిన్నోడు, ఊయక రమేష్‌లు బియ్యం పట్టుకుని ఆటోలో నెల్లిమర్ల వెళ్తున్నారు. ఆటోకు ముందు లైట్లు లేకపోవడంతో పాటు మితిమీరిన వేగంతో నడుపుతుండడంతో ఆరికతోట వద్దకు వచ్చేసరికి ముందున్న లారీని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో సాయమ్మ బయట రోడ్డుమీదికి తుళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మిగిలిన ముగ్గురికి చిన్నచిన్న గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సంఘటన వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి కుమారుడు తిరుపతిరావు ఫిర్యాదుమేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



తప్పిపోయిన సలోని

బాడంగి: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న పెంకి సలోని (55) ఐదురోజులుగా కనిపించడంలేదని ఆమె సోదరుడు గుంట సంగయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఆయన తన ఫిర్యాదులో తన సహోదరి సలోని గురువారం నుంచి ఇంటివద్ద కనిపించడం లేదని పేర్కొన్నా డు. ఐదురోజులుగా బంధువులు, తెలిసినవారు, పొలాల్లో వెతికిన ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదుచేసినట్టు చెప్పారు. ఆమె భర్త చనిపోగా ఇద్దరు అమ్మాయిలున్నారని మతిస్థిమితం కోల్పోయి ఎప్పుడూ పిచ్చిదానిలా తిరుగుతుందని అదేవిధంగా ఎక్కడో ఉంటుందని అనుకున్నామని కాని ఐదు రోజులుగా ఇంటికి రాకపోవడంతో ఆందోళనగా ఉందని ఫిర్యాదులో వాపోయాడు. ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దరాప్తుచేస్తున్నామని ఎస్సై ఆర్.జయంతి చెప్పారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

- పలువురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతిచెందగా పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘటనపై సోమవారం పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పి.ఈశ్వరరావుతోపాటు పలువురు ఆటో డ్రైవర్ వి.రామలింగేశ్వరరావు ఆటోలో సోమవారం ఉదయం రైల్వే పనుల నిమిత్తం కృష్ణాపురం నుంచి పార్వతీపురం మీదుగా కొమరాడ వెళ్తుండగా అర్తాం గ్రామం దాటిన తరువాత ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఈశ్వరరావు, వెంకటరమణ, హరికృష్ణ, ఎం.లక్ష్మణరావు, ఆటో డ్రైవర్ రామలింగేశ్వరరావుకు పలుచోట్ల తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు రైల్వేవాహనంద్వారా చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వారిని తరలించారు. చికిత్స పొందుతూ గరుగుబిల్లి మండలం పెదగుడబ గ్రామానికి చెందిన చింతాడ హరికృష్ణ(30) మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు.

217 మద్యం సీసాల పట్టివేత



పట్టుకున్న మద్యం సీసాలతో ఎస్సై హరిబాబు నాయుడు



పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

గుర్ల: మండలంలోని వల్లాపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని గుర్ల ఎస్సై హరిబాబు నాయుడు సోమవారం ఆరెస్ట్ చేసి 217 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నిందితుడిని అరెస్ట్ చేయడంతో మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జామిలో 40 మద్యం బాటిల్స్..

జామి: అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారం అందడంతో ఎస్సై వీరబాబు సిబ్బందితో కలిసి సోమవారం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద నిఘా వేశారు. జామికి చెందిన పిన్నింటి అప్పారావు 40 మద్యం బాటిల్స్ కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకుని నిందితుడిని ఎస్.కోట న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గుర్ల: మండలంలోని తాటిపూడిలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన తాటిపూడి గ్రామానికి చెందిన కిరాణా షాపు యాజమాని కుసుమంచి మహేశ్వరరావుపై 6ఎ కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ శోభ తెలిపారు.



పూసపాటిరేగ: విజిలెన్స్ దాడుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

కుమిలిలో 350 కిలోలు..

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సీఎస్‌డీటీ మురళి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన పైడిపల్లి సూర్యనారాయణ ఇంట్లో నిల్వ ఉంచిన 350 కేజీల బియ్యం స్వాధీనం చేసుకుని 6ఎ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, కానిస్టేబుల్ పురుషోత్తం , రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ప్రతాప్



పార్వతీపురం: చికిత్సపొందుతున్న అప్పలనాయుడు

పార్వతీపురం: అత్తమామలు వేధిస్తున్నారని మనస్తాపం చెందిన అల్లుడు పార్వతీపురం పట్టణానికి చెందిన జి.ప్రతాప్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెయింటర్‌గా పనిచేస్తున్న ప్రతాప్ అత్మవారి ఇంటిలోనే భార్యా,పిల్లలతో కొన్నేళ్లుగా ఉంటున్నాడు. కలిసి ఉన్న సమయంలో అత్తమామలు ప్రతాప్‌తో రూ.5లక్షలు అప్పు చేయించారు. ఆ అప్పు విషయమై కొద్ది రోజులనుంచి అత్తమమాలతో గొడవ పడి వారింటి దగ్గర భార్యాపిల్లలను విడిచిపెట్టి తల్లిదండ్రుల దగ్గరికి ప్రతాప్ వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు, బంధువులు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందుతాగి వృద్ధుడు..

పార్వతీపురం: మతిస్థిమితం లేక ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం లచ్చిరాజుపేట గ్రామానికి చెందిన ఎం.అప్పలనాయుడికి మద్యం తాగే అలవాటుంది. కొద్ది రోజులనుంచి మతిస్థిమితం కూడా లేదు. మద్యం మత్తులో ఉన్న అప్పలనాయుడు సోమవారం ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఇంటిలో ఉన్న పురుగు మందును తాగాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు గమనించి చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.


క్రీడల్లో ప్రతిభ కనబరచాలి



క్రీడాకారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

పార్వతీపురం: జిల్లాలో ఏర్పాటుచేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో క్రీడాకారులు ప్రతిభను కనబరచాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌లోని సమావేశమందిరంలో శిక్షణ శిబిరాలకు క్రీడాపరికరాలు, విద్యార్థులకు సర్టిఫికెట్స్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా క్రీడల చీఫ్‌కోచ్ ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 50 క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి శిబిరానికి ప్రభుత్వం ఏడు వేలరూపాయలు కేటాయించిందని, దానిలో నాలుగువేల రూపాయలతో మెటీరియల్ కొనుగోలు, రెండువేల రూపాయలు కోచ్ రెమ్యునరేషను, వేయిరూపాయలు ఇతర ఖర్చులకు కేటాయించినట్లు తెలిపారు. 50 క్యాంపులకు ప్రస్తుతం 922 బాలురు 512 మంది బాలికలు హాజరతున్నారని, వేసవిలో క్రీడా శిబిరాలను నిర్వహించడం ద్వారా విద్యార్థులలో గల ప్రతిభను వెలికి తీసేందుకు అవకాశం ఏర్పడుతుందని, వారిలో శారీరక దారుఢ్యం పఠనాసక్తి పెరుగుతాయన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, కోచ్‌లు పాల్గొన్నారు.

తప్పిపోయిన ఐదేళ్ల బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబసభ్యులకు అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. వన్‌టౌన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఉడా కాలనీలో లెంక జయరాం అనే ఐదేళ్ల బాబు మే 15న తప్పిపోయినట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందింది. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేసి బాలుడి ఆచూకీ గురించి ఉడాకాలనీ, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రాంతాల్లో విచారణ చేసి, తప్పిపోయిన జయరామ్ ఆచూకీ కనిపెట్టారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు బాలుడి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. సకాలంలో స్పందించిన పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు ఫీజు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: నిబంధనలకు విరుద్ధంగా అదనపు ఫీజు వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు బలివాడ గౌరీశంకర్‌ను సోమవారం కలిసి, వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 వేలు నుంచి 4 వేల వరకు అదనంగా ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల విధానం కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు పాటించడం లేదన్నారు. పుస్తకాలు, యూనిఫాం, ఇతర విద్యాసామగ్రి వారి వద్దే కొనుగోలు చేయాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై శిక్షణ



శిక్షణకు హాజరైన సచివాలయ సిబ్బంది, అధికారులు

సంతకవిటి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి అధ్యక్షతన సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారుకి వ్యక్తిగతంగా సంక్షేమ పథకాలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులున్నా టోల్ ఫ్రీ నంబర్ 1902కు కాల్ చేయాలని, కాల్ చేసిన వెంటనే వైఎస్ఆర్ ఐడి వస్తుందని తెలిపారు. సమస్య పరిష్కారమయ్యేవరకు ఎస్ఎంఎస్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తారన్నారు. తహసీల్దార్ ఎ.సులోచనారాణి, ఏపీఓ త్రినాథ్, ఏపీఎం టి.సీతారాం , ఈఓపీఆర్‌డీ బి.రాంబాబు, హౌసింగ్ ఏఈ కనకయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800-00
బంగారం(22సి. 10గ్రా.)	56,650-00
వెండి (కిలో)	78,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹ 264